క్లుప్తంగా

ఖండివరంలో 101 ఘటాలతో భవానీ భక్తుల పూజలు



గ్రామంలో ఘటాలతో తిరుగుతున్న భవానీ భక్తులు

చీడికాడ : ఖండివరంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గ్రామానికి చెందిన భవానీ భక్తులు ఆదివారం రాత్రి 101 ఘటాలను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా భవానీ భక్తులు నాయుడు, మేచలపు కామేష్ మాట్లాడుతూ గ్రామం సుభిక్షంగా ఉండాలని 101 ఘటాలతో అమ్మవారికి పూజలు చేశామన్నారు. అనంతరం రామాలయం వద్ద జరిగిన హోమం కార్యక్రమంలో భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు. సీడీసీ చైర్మన్ సుంకర శ్రీను, మండల కో–ఆప్షన్ మెంబర్ షేకు సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ ఐషర్ వ్యాను దగ్ధం



తాండవ జంక్షన్‌లో మంటలు అదుపు చేస్తున్న నర్సీపట్నం అగ్నిమాపక సిబ్బంది

నాతవరం : నర్సీపట్నం నుంచి తుని వైపు వెళ్తున్న ఐషర్ వ్యాను ఆదివారం తాండవ జంక్షన్‌కు వచ్చేసరికి వాహనం షార్టు సర్క్యూట్ కారణంగా ప్రమాదశావత్తూ అగ్నిప్రమాదంలో కాలిపోయింది. నర్సీపట్నం నుంచి అగ్గిపెట్టెలు భోజనాలు చేసే ప్లేట్లు లోడు వేసుకోని ఆదివారం ఉదయం వస్తుండగా నాతవరం మండలం తాండవ జంక్షన్ సమీపంలో కాలకృత్యాలు కోసం డ్రైవరు రోడ్డు పక్కన ఉన్న జీడితోటలోకి వెళ్లారు. ఒక్కసారిగా ఐషర్ వ్యాను లోంచి పొగతో పాటు మంటలు వ్యాపించాయి. స్థానికులు గుర్తించి నర్సీపట్నం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వాహనం వచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసింది. అప్పటికే వాహనం అందులో ఉన్న సామాగ్రి పూర్తిగా కాలిపోయిందని స్థానికులు తెలిపారు.

కూలిన విద్యాశాఖ కార్యాలయ మరుగుదొడ్లు



విద్యాశాఖ కార్యాలయం ఆవరణలో కూలిన మరుగుదొడ్లు

దేవరాపల్లి : మండల విద్యాశాఖ కార్యాలయం భవనం వెనుక భాగంలో ఉన్న మరుగుదొడ్లు కూలిపోయాయి. సెప్టిక్ ట్యాంక్ మీద మరుగుదొడ్లు గదులు నిర్మించగా, ట్యాంక్‌పై వేసిన సిమెంట్ పలకలు విరిగిపోవడంతో మరుగుదొడ్లు కిందికి కూలిపోయాయి. దీంతో మండల విద్యాశాఖ కార్యాలయంలో సిబ్బందికి మరుగు సమస్య నెలకొంది. మహిళా సిబ్బందితో పాటు కార్యాలయానికి వచ్చే ఉపాధ్యాయులు సైతం మరుగు సౌకర్యం లేక అవస్థ పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే మరుగుదొడ్లు నిర్మించాలని కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు 30 మంది ఎంపిక



కంటి పరీక్షలను నిర్వహిస్తున్న ఆప్తాలమిక్ హరిచందన

కె.కోటపాడు : వాసవీక్లబ్ ఆధ్వర్యంలో కె.కోటపాడు హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో జరిగిన వైద్య శిబిరంలో శంకర్ ఫౌండేషన్‌కు చెందిన ఆప్తాలమిక్ హరిచందన, పవిత్ర 56 మందికి పరీక్షలను జరిపారు. వీరిలో 30 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి శంకర్ ఫౌండేషన్‌కు తరలించారు. కంటి సంబంధిత సమస్యలకు ప్రాథమిక దశలోనే మెరుగైన వైద్యం పొందాలని కె.కోటపాడు వాసవీ క్లబ్ సెక్రటరీ కోట్ల రాంబాబు (రాము) సూచించారు. క్యాంప్ కోఆర్డినేటర్ అశ్వినీకుమార్ పాల్గొన్నారు.

వడ్డాది సంతలో దసరా సందడి



పొట్టేళ్ల కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న వడ్డాది సంత

బుచ్చెయ్యపేట : మండలంలో మేజర్ పంచాయతీ వడ్డాది సంతకు పండగ కళ వచ్చింది. జిల్లాలోనే పెద్ద సంతతో పాటు దసరా పండగ రావడంతో ఆదివారం సంతకు పండగ శోభ కనిపించింది. దసరా పండగ నాడు అమ్మవారికి మొక్కులు తీర్చడం ఆనవాయితీగా వస్తోంది. ఇళ్ల వద్ద, మోటారు మెహికల్, మెషినరీ, ఇతర పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా అమ్మవారికి జంతు బలి ఇస్తారు. దీంతో నాటుకోళ్లు, గొర్రె, మేక పోతులు కొనుగోళ్లు భారీగా సాగాయి. తెల్లవారు 7 గంటల నుండి విశాఖ, పాడేరు, నర్సీపట్నం, గాజువాక, అనకాపల్లి, మాడుగుల, చోడవరం, పెందుర్తి తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు, కొనుగోలుదారులు కొనుగోళ్లు, అమ్మకాలకు వడ్డాది సంతకు భారీగా తరలివచ్చారు. ముఖ్యంగా పొట్టేళ్లు, నాటుకోళ్ల కొనుగోలుతో వడ్డాది సంత రద్దీగా మారింది. ఒక్కో మేక, గొర్రె పోతులు రూ. 15 వేల నుంచి రూ. 25 వేల వరకు ధర పలికాయి. అలాగే నాటుకోళ్లు రూ. 900 నుంచి రూ. 4 వేలు వరకు ధర పలికాయి. వడ్డాది సంతలో నాటుకోళ్లు, పొట్టేళ్లతో పాటు ఇతర వస్తువులు కొనుగోలు, అమ్మకాలకు భారీగా జనాలు తరలిరావడంతో వడ్డాది సంత పండగ వాతావరణం కనిపించింది. పొట్టేళ్లు, నాటుకోళ్లను భారీగా కొనుగోలు చేసి వ్యాన్‌లు ఇతర వాహనాలు ద్వారా తరలించారు. శని,ఆది వారం రెండు రోజుల్లో దుర్గాదేవికి మొక్కులు తీర్చడానికి నాటుకోళ్లు, గొర్రెలు, మేకలు కొనుగోలు చేసి తరలించడంతో వడ్డాది రోడ్లు జనాల రద్దీతో నిండిపోయింది. సుమారు డెబ్బై లక్షలకు పైగా అమ్మకాలు, కొనుగోళ్లు జరిగినట్టు వ్యాపారులు తెలియజేశారు.



వడ్డాది సంతలో నాటుకోళ్లు కొనుగోలు

భారీగా నాటుకోళ్లు, పొట్టేళ్ల అమ్మకాలు



సంతలో కొనుగోలు చేసిన పొట్టేళ్లు తరలింపు

కె.జె.పురంలో అమ్మవారికి కుంభాభిషేకం



వంటర్లపాలెం కనకదుర్గమ్మ ఆలయం వద్ద చండీహోమంలో పాల్గొన్న భక్తులు



కె.జె.పురంలో అమ్మవారిని దర్శించుకుంటున్న బీజేపీ నాయకులు మండల సుబ్బలక్ష్మి తదితరులు

మాడుగుల రూరల్ : శరనవరాత్రి ఉత్సవాలులో భాగంగా గ్రామాల్లో అమ్మవారికి ఆదివారం పూజలు నిర్వహించారు. కె.జె.పురం చెరకు కాటా ఆవరణలో శీలం అప్పారావు కుటుంబ సభ్యులు సారధ్యంలో అమ్మవారికి కుంభాభిషేకం నిర్వహించారు. గ్రామంలో గల భవానీ భక్తులు తాచేరు నదిలో బిందెలతో నీరు తీసుకోని, అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేసారు. కె.జె.పురం కళావేదిక వద్ద ప్రతిష్ఠించిన దేవి అమ్మవారిని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యురాలు మండల సంతోషి సుబ్బలక్ష్మి, పుట్టా రాంబాబు, బీజేపీ నాయకులు మద్దాల రమణ దర్శించుకున్నారు.

వంటర్లపాలెంలో చండీహోమం

వంటర్లపాలెం కనకదుర్గమ్మ ఆలయంలో ఐదు గురు దంపతులతో చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని 4 వ రోజు శ్రీ లలితా త్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. ఆలయం వద్ద అన్న సమారాధన జరిపారు.

ప్రభుత్వ విధానాలపై ఉద్యమించండి

డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న



నియోజకవర్గ స్థాయి కాంగ్రెసు పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బన్న

మాడుగుల రూరల్ : గ్రామ స్థాయి నుంచి కాంగ్రెసు పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త కృషి చెయ్యాలని, డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా ఆయన ఆదివారం మాడుగులలో నియోజకవర్గ పార్టీ కార్యకర్తలతో సమావేశం అయ్యారు. సమావేశానికి పీసీసీ మాజీ కార్యదర్శి పడాల కొండలరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో సుబ్బన్న మాట్లాడుతూ మండల, నియోజకవర్గ, గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని కార్యకర్తలను కోరారు. ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల మీద ఉద్యమించాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు ఏసురాజు, పుట్టా అమరయ్యగుప్తా, గౌరునాయుడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడికి సత్కారం



బూడిని దుశ్శాలువాతో సన్మానించి మొక్కను అందిస్తున్న నాయకులు

కె.కోటపాడు : అనకాపల్లి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన బూడి ముత్యాలనాయుడును ఎ.కోడూరు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసారు. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమితులవ్వడం పట్ల వారంతా హర్షం తెలిపి బూడిని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపికగా మొక్కను అందించారు. పార్టీ పటిష్టతకు కార్యకర్తలంతా ఐక్యంగా పని చేయాలని బూడి వారికి సూచించారు. కలిసిన వారిలో గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు బొడ్డు ప్రకాశి, ఎంపీటీసీ లెక్కల గౌతమి, సచివాలయ కన్వీనర్ బొడ్డు శ్రీనివాసరావు, కోటకల నానాజి, శెట్టి శ్రీను, పొనగంటి మహేశ్వర రావు, మెల్లూరి శ్రీనివాసరావు ఉన్నారు.

రెండు గ్రామాల్లో కేంద్ర పథకాలపై ఆరా



ఎం.కృష్ణాపురంలో పింఛన్లు, ఎస్‌జీహెచ్ పథకాలపై సమాచారం సేకరిస్తున్న కేంద్ర బృందం

మాడుగుల : గ్రామీణ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు సక్రమంగా అమలు అవుతున్నాయా లేదా అని మండలంలో ఎం. కృష్ణాపురం, కింతలి గ్రామాల్లో ఆదివారం నేషనల్ లెవెల్ మోనిటరింగ్ (ఎన్ఎల్ఎం) బృందం సర్వే చేసింది. కేంద్ర బృంద సభ్యులు అనిల్ గైక్వాడ్, అనిల్ నింబోర్కర్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ మేనేజర్ పి.శ్రీనివాస్‌లు ముందుగా ఎం. కృష్ణాపురం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులు ఎలా జరుగుతున్నాయని ఆరా తీశారు. వితంతు, వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు ఎలా అందుతున్నాయని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న 26 డ్వాక్రా సంఘాల సభ్యులతో మాట్లాడారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు అందిస్తున్న రుణాలు, రికవరీ, ఎలా ఉందని, బ్యాంకుల సహకారం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఎస్‌హెచ్‌జీ రుణాలతో మహిళలు అభివృద్ధి చెందడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోనే ఎం.కృష్ణాపురం ఎస్‌హెచ్‌జీ రుణాలు పెట్టుబడితో చిరు వ్యాపారాలతో అభివృద్ధి, గొర్రెలు, మేకలు పెంపకంలాంటి విషయాల్లో ముందంజలో ఉందని, కేంద్రం అందిస్తున్న పథకాలు గ్రామాల్లో సక్రమంగా అమలవుతున్నాయని సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి అప్పారావు, సర్పంచ్ వడ్డాది చారుమతీదేవి, గాదిరాయి సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు, కింతలి సర్పంచ్ మైచర్ల భవానీ తదితరులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పథకానికి ఎంపికైన హైస్కూల్

మాకవరపాలెం : పీఎంశ్రీ పథకానికి మాకవరపాలెం ఉన్నత పాఠశాల ఎంపికైందని హెచ్‌ఎం అచ్యుతరామయ్య తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ రెండో విడతగా ఈ పాఠశాలను ఎంపిక చేశారన్నారు. పథకంలో పాఠశాల అభివృద్ధికి రూ.కోటి నిధులు కేటాయించనున్నట్టు ఆయన తెలిపారు. ఈ నిధులతో పాఠశాలను మరింత అభివృద్ధి చేయవచ్చునన్నారు.

శిథిలావస్థలో ఎంపీడీవో కార్యాలయం



పెచ్చులూడిపోయిన ఎంపీడీవో కార్యాలయం

గొలుగొండ : ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనంలో విధులు నిర్వహించడానికి అధికారులు భయపడుతున్నారు. ఫిర్యాదులు చేయడం కోసం వచ్చిన ప్రజలు ఇక్కడ ఎక్కువ సమయం ఉండడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి గది అయిన నిత్యం ఏదో చోట పెచ్చులూడిపోవడం జరుగుతుంది. అయినా అధికారులు నిర్వహించడం జరుగుతుంది. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందో అని భయపడుతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి ఈ భవనం మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఆత్యాపాత్యా పోటీల్లో నర్సీపట్నం విద్యార్థినుల ప్రతిభ



ఆత్యపాత్య పోటీల్లో రాణించిన విద్యార్థినులు

నర్సీపట్నం : నెల్లూరులో జరిగిన ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్స్ ఆత్యపాత్య స్టేట్ లెవెల్ టోర్నమెంట్ బాయ్స్, గరల్స్ పోటీల్లో నర్సీపట్నానికి చెందిన శ్రీవిద్యాంజలి స్కూల్ బాలికల టీమ్ ద్వితీయస్థానం, బాలుర టీమ్‌లు తృతీయస్థానంలో నిలిచాయి. వీరిని పాఠశాల కరస్పాండెంట్ వై.శాంతి, స్కూల్ చైర్మన్ వై.అక్షత్‌కృష్ణ, హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో పాఠశాలకు పేరు తీసుకువచ్చేందుకు బాలికలు, బాలుర టీమ్‌లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన పీఈటీని అభినందించారు.

నాట్యకళాకారిణికి బూడి అభినందనలు



ప్రసన్నలక్ష్మిని అభినందిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు తదితరులు

మాడుగుల : మాడుగులలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా సివిల్ ఆర్‌టీసీ మోటార్ యూనియన్ సభ్యులు ఆధ్వర్యంలో శనివారం రాత్రి దసరాపాక వద్ద నిర్వహించిన భరత నాట్య ప్రదర్శనలో అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చిన గ్రామానికి చెందిన మామిడి ప్రసన్న లక్ష్మిని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు దుశ్శాలువా కప్పి సత్కరించారు. అనంతరం దసరా ఉత్సవ కమిటీ సభ్యులు కూడా సత్కరించి బహుమతులు అందజేశారు. మాడుగుల పట్టణానికి చెందిన మామిడి లక్ష్మి ఢిల్లీలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో పలుసార్లు అద్భుతంగా భరత నాట్యం ప్రదర్శించి ప్రధాని మోదీతో ప్రశంసలు అందుకోవడం మాడుగుల పట్టణానికే గర్వకారణమని, మాడుగుల వాసులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామధర్మజ, కమిటీ గౌరవ అధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు ఎ.ఎస్.వి ప్రసాద్, సర్పంచ్ ఎడ్ల కళావతి, మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, పుట్టా మురళి, సివిల్ ఆర్‌టీసీ మోటార్ యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



ఉత్సాహంగా మ్యూజికల్ చైర్ ఆడుతున్న పూర్వ విద్యార్థినులు

రోలుగుంట: మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నతపాఠశాలలో 1989–90 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఆదివారం ఉదయం 9:30 గంటలకు సుమారు 40 మంది సమావేశానికి హాజరయ్యారు. వారి ఆహ్వానం మేరకు అప్పటి ప్రధానోపాధ్యాయుడు బల్లమూడి సత్యనారాయణ, కమిటీ టీచర్లు ఆడారి గణేష్, యర్రంశెట్టి నర్సింగరావు ఈ సమ్మేళనానికి హాజరయ్యారు. వృత్తి ఉద్యోగాల్లో ఎంతో ఎదిగిన ఒకనాటి తమ శిష్యులను వారంతా అభినందించారు. వారిని విద్యార్థులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఈ సమ్మేళనానికి ప్రధాన పాత్ర పోషించిన తమరాన సత్తిబాబును సహచరులంతా అభినందించారు.



మాకవరపాలెం హైస్కూలు ఆవరణలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

మాకవరపాలెం : పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉల్లాసంగా సాగింది. మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో 1981–82 ఏడాదిలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఈ పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. దీనికి వివిధ ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు హాజరై ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. 42 ఏళ్ల అనంతరం ఒకే వేదికపై కలుసుకున్న వీరంతా ఒకరికి ఒకరు చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈ సమ్మేళనంలో సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరిదేవిగా దుర్గమ్మ



సీతయ్యపేట ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు



సీతయ్యపేట దుర్గామల్లేశ్వర్ల అమ్మవారు



చోడవరం దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు

బుచ్చెయ్యపేట : దేవి శరన్నవరాత్రి దసరా మహోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు అమ్మవారిని లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆదివారం తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి సీతయ్యపేట దుర్గామల్లేశ్వర్ల అమ్మవారి దర్శనం కోసం వందలాది మంది భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. సెలవురోజు అవడంతో పలువురు ఉద్యోగులు, ప్రజలు అమ్మవారిని దర్శించికుని ప్రత్యేక కుంకుమ పూజలు చేపట్టారు. సీతయ్యపేటలో దుర్గామల్లేశ్వర్ల అమ్మవారికి తొమ్మిది రకాల పూలతో అభిషేకాలు నిర్వహించారు. బుచ్చెయ్యపేట, వడ్డాది, గున్నెంపూడి, లోపూడి, దిబ్బిడి, రాజాం తదితర గ్రామాల్లో దుర్గాదేవి మండపాల్లో ప్రత్యేక పూజలు చేసి ప్రసాదాలు పంచిపెట్టారు.

చోడవరంలో..

చోడవరం : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీలలితా త్రిపురసుందరి దేవి అలంకరణలో దుర్గాదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. చోడవరం పాతబస్టాండ్ దగ్గర వేంచేసియున్న దుర్గాదేవి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం లలితా త్రిపురసుందరి దేవిగా అమ్మవారిని అలంకరించారు. హోమం జరిపారు. సర్వాంగ సుందరంగా ముస్తాబైన అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు శివ ప్రత్యేక పూజలు చేశారు.

నర్సీపట్నం: శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో నాలుగో రోజైన ఆదివారం అమ్మవారు త్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. పట్టణంలోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దుర్గగుడి భక్తుల శరణ ఘోషతో మారుమోగుతుంది. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. ఆలయం ప్రాంగణం రద్దీ ప్రాంతం కావడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు.



మాడుగుల దేవీతల్లి

మాడుగుల : శరన్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మాడుగులలో వెలసిన దేవీతల్లిని అన్న పూర్ణాదేవి అవతారంలో ఆదివారం అలంకరించారు. ఈ సందర్భంగా మండలంలో సుమారు 1000 మంది భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తెల్లవారు జామున ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించిన భరత నాట్య ప్రదర్శన పోటీల్లో అద్భుతంగా ప్రతిభ కనబరిచిన మామిడి ప్రసన్న లక్ష్మిని కమిటీ సభ్యులు సన్మానించి బహుమతి అందజేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



జీవీఎంసీ పెద్ద హైస్కూల్ నుంచి గ్రీన్ క్లబ్ సభ్యుల బైక్ ర్యాలీ

అనకాపల్లి: భావితరాలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ తెలిపారు. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి రహదారిలోని కర్రివారివీధి నందనవనంలో క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. జామ, పనస, వేప, కానుగ, బాదం, ఉసిరి వాటర్‌యాపిల్, కదంబ, అశోక్ వంటి వంద మొక్కలను నాటారు. అంతకుముందు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ నుంచి క్లబ్ సభ్యులు బైక్ ర్యాలీగా కర్రివారి వీధికి చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ సమస్త జీవ వైవిధ్యాన్ని కాపాడుకునే బాధ్యత నేటి యువతరంపై ఉందన్నారు. వాతావరణంలో మార్పులు కారణంగా ప్రజలు వివిధ రకాల వ్యాధుల బారినపడే అవకాశాలు ఉన్నాయన్నారు. నేటి నుంచి కొత్తగా గృహాలు నిర్మించుకునే వ్యక్తులు రెండు మొక్కలు నాటి, పర్యవేక్షణ చేసినట్లయితే పరిశుభ్రమైన గాలిని పీల్చుకోవచ్చన్నారు. క్లబ్ సభ్యులు పొలమరశెట్టి వెంకట్, కర్రి పూర్ణచంద్రావు, కాండ్రేగుల నూకఅప్పారావు, కోయిలాడ వినయ్‌కుమార్, కాండ్రేగుల శివాజీ, విల్లూరి రాఘవ గణేష్, మురళీ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు హిమశేఖర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం మావూరు రాంప్రసాద్ షష్ఠ్యబ్ది ఉత్సవ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ''రామాయణంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు పరిరక్షణ సమితి కన్వీనర్ కె.రామ్మోహన్ రావు తెలిపారు. వ్యాస రచన పోటీలకు 125 మంది విద్యార్థులు, వక్తృత్వ పోటీలకు 80 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

బీసీ గర్జన విజయవంతం చేయండి

తుమ్మపాల: బీసీ కుల, జన గణన కోసం విజయవాడ ధర్నా చౌక్ వద్ద 9న జరగనున్న బీసీ గర్జనను విజయవంతం చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు కోరారు. పట్టణంలో పలువురి బీసీ సంఘాల నేతలను కలిసి కరపత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబాటుకు గురవుతున్న బీసీ వర్గాల హక్కులను కాపాడుకునేందుకు, బీసీ కులాల ప్రజల వాస్తవ సంఖ్య స్పష్టం అయ్యేందుకుగాను, తద్వారా రాజ్యాంగం అందిస్తున్న రిజర్వేషన్ ఫలాలు బీసీలకు దక్కాల్సిన వాటా పొందేందుకుగాను, బీసీ కుల, జన గణన తప్పక జరగాలన్నారు. ఇందుకోసం బీసీ కులాలు అన్ని ఏకతాటిపై వచ్చి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.